సాక్షి
వికారాబాద్

గురువారం । 7 । ఆగస్టు । 2025



ఆహ్లాదం.. విజ్ఞానం

సర్కారు బడులను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక కార్యక్రమాలతో ముందుకు సాగుతోంది. 8లో▸



పన్ను చెల్లింపుతోనే అభివృద్ధి

గ్రంథాలయాల అభివృద్ధికి జీపీలు, మున్సిపాలిటీలు సహకరించాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. 8లో▸



పెరిగిన సాగు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్నదాతల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. దీంతో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. 9లో▸

న్యూస్‌రీల్

9న లక్ష తులసీ అర్చన



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

కొడంగల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలిసిన పద్మావతీ సమేత శ్రీమహాలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 9న మూడో శనివారం సందర్భంగా స్వామివారికి లక్ష తులసీ దళాలతో అర్చన నిర్వహించనున్నారు. ప్రత్యేకంగా తెప్పించిన పూలు, తులసీ దళాలతో మూల మూర్తులకు విశేష అలంకరణ చేస్తారు. పండితులు విష్ణు సహస్ర నామావళి పటిస్తూ లక్ష తులసీ దళాలతో అర్చన చేస్తారు. శ్రావణ మాసం మూడో శనివారం కావడంతో శ్రీవారి మూలమూర్తికి అభిషేకం, తోమాల సేవ, అలంకరణ చేయనున్నారు. విష్ణుసహస్ర నామార్చన, నైవేద్య సమర్పణ, మహా మంగళ హారతి తదితర కార్యక్రమాలను నిర్వహిస్తారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

అందుబాటులో సబ్సిడీ గడ్డి విత్తనాలు

అనంతగిరి: జిల్లాలోని అన్ని పశు వైద్యశాలల్లో 75శాతం సబ్సిడీపై మేలుజాతి గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జిల్లా పశు వైద్యాధికారి సదానందం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు కేజీల మినీ కిట్స్ పూర్తి ధర రూ.500 కాగా సబ్సిడీ రూ.375 పోను రూ.125 చెల్లించాల్సి ఉందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుతాం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



ఇంటింటికి బీజేపీ కార్యక్రమంలో పార్టీ నాయకులు

అనంతగిరి: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్ మండలం కామారెడ్డిగూడలో ఇంటింటికి బీజేపీ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. బీజేపీతోనే సుపరిపాలన సాధ్యమన్నారు. నేడు ఎక్కడ చూసినా కేంద్రం ప్రభుత్వం చేపడుతున్న పనులే కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో అందరం కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు అమరేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శివరాజుగౌడ్, నాయకులు గోపాల్‌రెడ్డి, గోపాల్, నర్సింహారెడ్డి, సురేందర్‌రెడ్డి, సంజీవరెడ్డి మైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

టీపీయూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంత్‌రావు



సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

చేవెళ్ల: ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కె.హన్మంత్‌రావు అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం సంఘం నాయకులతో కలిసి సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెల్త్‌కార్డులు వెంటనే అమలు చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, కామన్ సర్వీస్ రూల్స్ అమలుకు ప్రయత్నం చేయాలని, కేజీబీవీ, ఎస్ఎస్ఏ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, నూతన పీఆర్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించి విద్యాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యల సాధనకోసం టీపీయూఎస్ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కోట్ల కాశీరావు, గౌరవ అధ్యక్షుడు గణపురం సురధీర్, మండల కోశాధికారి దూత కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బిరబిరా కృష్ణమ్మ

వేగంగా కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పనులు

- లక్ష ఎకరాలకు పైగా సాగునీరు, 5.50 లక్షల మందికి తాగునీరే లక్ష్యం
- ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.4,500 కోట్లు
- మొదటి విడతలో రూ.2,945 కోట్లు మంజూరు



నారాయణపేట జిల్లా కాచ్వార్ వద్ద చురుగ్గా సాగుతున్న పైప్‌లైన్ పనులు, బిగిస్తున్న యంత్రాలు



కొడంగల్: కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకం పనులు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపడంతో పరుగులు పెడుతున్నాయి. నారాయణపేట జిల్లా సరిహద్దు వరకు పనులు పూర్తి కాగానే మన జిల్లాలో ప్రారంభిస్తారు. మొదటి విడతలో దామరగిద్ద మండలం కానుకుర్తి వరకు చేపట్టారు. ఇది పూర్తి కాగానే కొడంగల్ నియోజకవర్గంలో ప్రారంభమవుతాయి. కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లో లక్షా 5వేల ఎకరాలకు సాగు నీరు అందించే ఈ పథకానికి సుమారు రూ.4,500 కోట్లు అంచనా వేశారు. మొదటి విడతలో రూ.2,945 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

జీఓ 69కి జీవం పోసిన సీఎం

గతంలో అటకెక్కిన జీఓ 69కు సీఎం రేవంత్‌రెడ్డి జీవం పోశారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేసింది. బీమా ఎత్తిపోతల ద్వారా కొడంగల్, నారాయణపేట, మక్తల్ నియోజకవర్గాల్లోని లక్షా 5వేల ఎకరాలకు సాగునీరు, 5లక్షల 50వేల మందికి తాగునీరు అందించాలని నిర్ణయించింది. 2014లో రాష్ట్ర విభజన జరిగి టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాన్ని పక్కన పెట్టింది. 69 జీఓను అమలు చేయకుండా అటకెక్కించింది.

నాలుగు రిజర్వాయర్లు

మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల మీదుగా కృష్ణానది ప్రవహిస్తూ తెలంగాణలో నారాయణపేట జిల్లా కృష్ణా మండలంలోకి ప్రవేశిస్తుంది. కృష్ణానదిపై తెలంగాణలో తొలి ప్రాజెక్టు జూరాలను నిర్మించారు. ఇక్కడి నుంచి నికర జలాలతో మూడు నియోజకవర్గాలకు సాగు, తాగునీరు ఇవ్వాలని ఇంజనీర్లు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. బూత్‌పూర్ రిజర్వాయర్ నుంచి నాలుగు దశల్లో ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందిస్తారు. ఊట్కూర్, జాజాపూర్, జయమ్మ చెరువు, కానుకుర్తి దగ్గర రిజర్వాయర్లు నిర్మిస్తారు. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా ఊట్కూర్, జాజాపూర్, జయమ్మ చెరువు, కానుకుర్తి, లక్ష్మీపూర్, ఈర్లపల్లి, దౌల్తాబాద్, హస్నాబాద్, కొడంగల్, బొంరాస్‌పేట చెరువులను కాకరవాణి ప్రాజెక్టును నింపి ఆయకట్టు భూములకు సాగునీరు వదులుతారు. ఈ పథకానికి రేవంత్ సర్కార్ పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది.

తెరపైకి 'పాలమూరు – రంగారెడ్డి'

కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకాన్ని పక్కన పెట్టి పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని తెరపైకి తెచ్చారు. ఈ ప్రాంతానికి మూడు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న శ్రీశైలం నుంచి కొడంగల్‌కు సాగునీరు రాదని కొడంగల్ - నారాయణపేట ఎత్తిపోతల పథకం జలసాధన సమితి సభ్యులు ఉద్యమించారు. అయినా గత ప్రభుత్వం స్పందించలేదు. రేవంత్‌రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్న 2014 నుంచి 2018 వరకు పలుమార్లు ఈ పథకాన్ని అమలు చేయాలని బీఆర్ఎస్ ప్రభుత్వంపై పోరాటం చేశారు. అయినా పాలకులు పట్టించుకోలేదు. ఎట్టకేలకు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత 2024లో ఈ పథకానికి ప్రాణం పోశారు.

లక్ష్యాన్ని అధిగమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

- ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరిగేలా చూడాలి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

అనంతగిరి: ప్రభుత్వ ఆస్పత్రులో ప్రసవాలు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని ప్రోగ్రాం ఆఫీసర్లు, వైద్యాధికారులు, ఎంఎల్ హెచ్‌పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ కే లలితాదేవి జిల్లాలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాలు, అసంక్రమిత వ్యాధులు, టీబీ నియంత్రణ కార్యక్రమలపై సమీక్షించారు. పీహెచ్‌సీలు, ఆరోగ్య ఉప కేంద్రాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. జిల్లాలో 87 ఆరోగ్య ఉప కేంద్రాలు నిర్మాణ దశలో ఉన్నాయని, నాణ్యత పాటిస్తూ మూడు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. మాతాశిశు మరణాలపై ప్రతి మూడు నెలలకు సమీక్ష చేయాలన్నారు. ఈనెల 11న నులిపురుగుల నివారణ కార్యక్రమం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, అడిషనల్ కలెక్టర్ సుధీర్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రవీంద్ర యాదవ్, పంచాయతీ రాజ్ ఈఈ ఉమేష్, డాక్టర్ పవిత్ర, వైద్యాధికారులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాల్లోని విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంతోపాటు మెనూ ప్రకారం భోజనం అందించాలి కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, వసతి గృహాల వార్డెన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వసతి గృహాల్లో చేపట్టిన మరమ్మతు పనులను సత్వరం పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు తరచూ వైద్య సేవలు అందేలా చొరత తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, ట్రైనీ కలెక్టర్ హార్ష్ చౌదరి, డీఆర్‌డీఏ శ్రీనివాస్, సంక్షేమ శాఖ జిల్లా అధికారులు కమలాకర్ రెడ్డి, ఉపేందర్, రాజేశ్వరి, వార్డెన్లు పాల్గొన్నారు.

పరిశ్రమల్లో తనిఖీలు

అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని పరిశ్రమల్లో యూరియా వాడకంపై జిల్లా వ్యవసాయాధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. కొన్ని పరిశ్రమల్లో అనధికారికంగా యూరియా వాడుతున్నట్లు సమాచారం రావడంతో తనిఖీలు చేపట్టారు. వాటిలో యూరియా వినియోగించడం లేదని గుర్తించారు. కార్యక్రమంలో ఏడీఏ వెంకటేశం, మండల వ్యవసాయాధికారి ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



పరిశ్రమలో తనిఖీలు చేస్తున్న అధికారులు

మా సమస్యలు పరిష్కరించండి

- రాజీవ్ స్వగృహ ప్లాట్ల వేలాన్ని అడ్డుకున్న రైతులు
- అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి హామీతో శాంతించిన వైనం



రైతులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

హయత్‌నగర్: అబ్దుల్లాపూర్‌మెట్టు మండలం తొర్రూర్‌లో హెచ్ఎండీఏ ద్వారా రూపొందించిన లే అవుట్‌లో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ చేపట్టిన ప్లాట్ల వేలాన్ని భూములు ఇచ్చిన రైతులు అడ్డుకున్నారు. తమకు పరిహారంగా ఇచ్చిన ఇళ్ల స్థలాలను రిజిస్ట్రేషన్ చేయకుండా వేలం వేయడంపై అభ్యంతరం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. తొర్రూర్‌లోని సర్వే నంబర్ 383/1లో సుమారు 117 ఎకరాల ప్రభుత్వ భూమిని లే అవుట్ చేసి ప్లాట్లుగా విభజించి అమ్మేందుకు గత ప్రభుత్వ హయాంలో రైతుల నుంచి హెచ్ఎండీఏ అధికారులు సేకరించారు. పొజిషన్‌లో ఉన్న రైతులకు పరిహారం కింద ఒక్కొక్కరికి 300 గజాల ఇంటి స్థలాన్ని అదే లే అవుట్‌లో ఇచ్చేందుకు ఒప్పించారు. ఈ మేరకు అలాట్‌మెంట్ పత్రాలు జారీ చేశారు. అనంతరం కొన్ని ప్లాట్లను వేలం వేశారు. తమకు ఇచ్చిన పత్రాల ఆధారంగా ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాలని, ఆ స్థలాలపై పూర్తి హక్కుల కల్పించాలని రైతులు కొంత కాలంగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఈ క్రమంలో హెచ్ఎండీఏ నుంచి అధికారం పొందిన రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ 510 ప్లాట్లలో 100 ప్లాట్లను వేలం వేసేందుకు సిద్ధమైంది. గ్రామంలోని ఓ కన్వెన్షన్ హాలులో వేలం వేసేందుకు బుధవారం ఆర్డీఓ అనంతరెడ్డి, తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి, రాజీవ్ స్వగృహ సీఈ భాస్కర్‌రెడ్డి, ఈఈ నరేందర్ రెడ్డి వచ్చారు. బహిరంగ వేలం మొదలు పెట్టగానే పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్న రైతులు వేలం పాటకు అడ్డు తగాలారు. పోలీసులు కలుగ జేసుకోవడంతో తోపులాట జరిగింది. అనంతరం వేలం వాయిదా వేస్తున్నట్లు అధికారులు ప్రకటించి వెనుదిరిగారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డిని అక్కడికి పంపించారు. రైతులు ప్రభుత్వానికి సహకరించాలని, 10–15 రోజుల్లో ప్లాట్లు రిజిస్ట్రేషన్ జరిగే విధంగా చూస్తామని ఆయన హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.



నివాళులర్పిస్తున్న జిల్లా అధికారులు

మహోన్నత వ్యక్తి జయశంకర్

- అడిషనల్ కలెక్టర్ సుధీర్
- కలెక్టరేట్‌లో ఘనంగా జయంతి వేడుకలు

అనంతగిరి: తెలంగాణ ఉద్యమం కోసం ప్రొఫెసర్ జయశంకర్ తన జీవితాన్ని అంకితం చేశారని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి తోకలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జయశంకర్ సేవలను కొనియాడారు. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో మంచి ప్రావీణ్యం ఉన్న వ్యక్తి అని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్ర ఆవస్యకతను ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి అన్నారు. ఆయన కలలుగన్న తెలంగాణ కోసం మనమందరం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఉపేందర్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి అసిస్టెంట్లను నియమించుకోవాలి

పోలింగ్ కేంద్రాల్లో పర్యవేక్షణకు ఆయా పార్టీలు బూత్‌స్థాయి అసిస్టెంట్లను నియమించుకోవాలని అడిషనల్ కలెక్టర్ సుధీర్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణకు సన్నాహాలు, కొత్త పోలింగ్ బూత్‌ల ఏర్పాటు, భవనాల గుర్తింపు తదితర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 1,200 మందికి మించి ఓటర్లు ఉండరాదన్నారు. జిల్లాలో 284 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, బూత్ స్థాయి అసిస్టెంట్లను నియమించి ఎన్నికల కమిషన్ సైట్‌లో అప్‌లోడ్ చేసి అనుమతి పొందాలని సూచించారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో బీఎల్ఓలు, బీఎల్ఏలు సమన్వయంతో పని చేసి ఓటరు జాబితాలో పేర్ల మార్పులు, చేర్పులు చేయాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో వికారాబాద్ తహసీల్దార్ లక్ష్మీనారాయణ, డీటీ అనిత పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా గురుకులాలు



ఆన్‌లైన్ తరగతులను పరిశీలిస్తున్న రమణకుమార్

- బోధన, వసతుల కల్పనలో మేటి
- ట్రైస్ సెక్రటరీ రమణకుమార్
- తాండూరులోని గురుకుల బాలికల పాఠశాల సందర్శన

తాండూరు టౌన్: ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ గురుకులాల్లో బోధన సాగుతోందని తెలంగాణ గురుకుల విద్యా సంస్థల (ట్రైస్) కార్యదర్శి సీహెచ్ రమణకుమార్ అన్నారు. బుధవారం తాండూరులోని తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, వంటగది, లైబ్రరీ, ల్యాబొరేటరీ, కంప్యూటర్ ల్యాబ్, ఆన్‌లైన్ బోధనను పరిశీలించారు. మెనూ ప్రకారం అల్పాహారం, భోజనం అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సిలబస్‌తో పాటు ఆన్‌లైన్ తరగతులపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ గురుకులాల్లో అత్యుత్తమ బోధన అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక వసతులను కల్పిస్తోందన్నారు. ప్రతి ఏటా ప్రైవేటుకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామని పేర్కొన్నారు. తాండూరు గురుకులంలో బోధన, ఫలితాలు, వసతులు భేషుగ్గా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి వెంకటయ్య గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూములు పరాధీనం

- జిల్లాలో 2,170 ఎకరాలు
- ఆక్రమణలపై తరచూ కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదులు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ, వక్ఫ్ బోర్డ్ అధికారులు
- 2006 సంవత్సరంలో సర్వే.. నేటికీ వెల్లడి కాని భూముల వివరాలు



పరిగి మండలం సుల్తాన్‌పూర్‌లో వక్ఫ్ భూములను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

వికారాబాద్: జిల్లాలో వక్ఫ్ బోర్డు భూములు రోజు రోజుకూ అన్యాక్రాంతం అవుతూనే ఉన్నాయి. మెజార్టీ భూములు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల పరిగి మండలం సుల్తాన్‌పూర్ రెవెన్యూ పరిధిలో వక్ఫ్ భూములను పక్క పొలం రైతులు ఆక్రమించారని ఎర్రగడ్డపల్లికి చెందిన కొందరు కలెక్టర్, ఎస్పీ, డీఆర్‌ఓ, తహసీల్దార్లకు ఫిర్యాదు చేశారు. సమాధులను సైతం కూల్చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో ఆ భూములను గతంలో వక్ఫ్ బోర్డు అధికారులు పలుమార్లు సందర్శించారు. కబ్జాకు గురయ్యాయని తేల్చారు. కానీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఆరోపణలు వచ్చిన ప్రతి సారీ వక్ఫ్ బోర్డు అధికారులు, రెవెన్యూ అధికారులు ఒకరిపై ఒకరు నెపం మోపి కాలం వెల్లదీస్తున్నారు. జిల్లాలో 2,170 ఎకరాల వక్ఫ్ భూములు ఉన్నాయని ఆ శాఖ అధికారులు చెబుతుండగా అవి చాలా వరకు కాగితాలకే పరిమితమయ్యాయి. పొజిషన్‌లో మాత్రం వేరేవారు ఉన్నట్లు తెలుస్తోంది. ఆయా గ్రామాల్లో పలుకుబడి ఉన్న వ్యక్తుల చేతుల్లోకి ఎప్పుడో వెళ్లి పోయాయి. కొన్ని చోట్ల సంరక్షకులుగా ఉన్న వారే యజమానులుగా మారిపోయారు. మరి కొన్ని చోట్ల కాగితాల్లో భూములు కనిపిస్తున్నాయి. పరాధీనం అయిన భూములపై ఫిర్యాదులు వచ్చినా విచారణ జరిపిన దాఖలాలు కనిపించడం లేదు. ఒక వేళ విచారణ జరిపినా నేతల ఒత్తిడి.. కాసులకు కక్కుర్తి పడుతున్న అధికారులు కారణంగా నివేదికలు బుట్టదాఖలవుతున్నాయి.

సర్వే చేయడంలో విఫలం

వక్ఫ్ భూములు ఉన్నదెంత.. ? అవి ఎక్కడెక్కడ ఉన్నాయి..? ఎవరి ఆధీనంలో ఉన్నాయి..? అనే దానిపై ఆ శాఖ అధికారులకే స్పష్టత లేదు. రెవెన్యూ అధికారులకు అవగాహన ఉన్నా వారు పట్టించుకోవడం లేదు. ఇటు రెవెన్యూ.. అటూ వక్ఫ్ బోర్డు అధికారుల కనుసన్నల్లోనే భూములు అన్యాక్రాంతం అవుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలో వక్ఫ్ భూములపై 1958 – 64 ప్రాంతంలో సర్వే నిర్వహించారు. 2006లో మరోసారి సర్వే చేసినా ఆ వివరాలను ప్రభుత్వం ప్రకటించలేదు. ఈ సర్వే ప్రకారం వక్ఫ్ భూముల విస్తీర్ణం ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

రెండో విడత సర్వే చేసి ఉంటే..

రాష్ట్ర ప్రభుత్వం 2017 ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన భూ ప్రక్షాళన సర్వేలో అన్యాక్రాంతమైన భూముల వివరాలు వెల్లడవుతాయని అందరూ భావించారు. కానీ మొదటి విడతలో కేవలం లిటిగేషన్ లేని భూములను మాత్రమే సర్వే చేశారు. రెండో విడత సర్వే చేసి ఉంటే వక్ఫ్ భూములు ఎవరి ఆధీనంలో ఉన్నాయో తెలిసేదని రెవెన్యూ అధికారులు అంటున్నారు.

అనేక చోట్ల కబ్జా

- పరిగి మండలం సుల్తాన్‌పూర్ శివారులో ఓ దర్గా సమీపంలో ఉన్న వక్ఫ్ బోర్డులు ఉన్నాయి. ఇందులో సుమారు ఐదెకరాల భూమి పరాదీనం అయ్యింది. గార్డియన్‌గా ఉన్న ఓ వ్యక్తి ఏకంగా వాటిని తన పేరున రాయించుకున్నాడు. ఈ విషయంలో స్థానకంగా నివాసముండే ఓ వ్యక్తి రెవెన్యూతో పాటు వక్ఫ్‌బోర్డు అధికారులకు ఫిర్యాదు చేశాడు. వారు విచారణ జరిపి నివేదిక కూడా ఉన్నతాధికారులకు అందజేశారు. కాని ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు. తాజాగా రెండు రోజుల క్రితం కూడా అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గతేడాది అధికారులు ఆ భూములను పరిశీలించి కబ్జాకు గురైనట్టు తేల్చారు, కాని ఎలాంటి చర్యలు తీసుకోవటంలేదు. వీటితో పాటు పరిగి మున్సిపల్ పరిధిలోని 568 సర్వే నెంబర్‌లో సుమారు 205 ఎకరాల భూమి ఉండగా అందులో చాలా వరకు అన్యాక్రాంతం అయ్యింది. పరిగి మండలం రాపోల్ గ్రామంలో వక్ఫ్ భూములు పరాధీనమయ్యాయి. ఇదే మండలం నారాయణ్‌పూర్‌లో 24 ఎకరాలు ఉండగా 22 ఎకరాలు కబ్జాకు గురైనట్లు స్థానికులు తెలిపారు. వికారాబాద్, ధారూరు, తాండూరు మండలాల్లో సైతం అన్యాక్రాంతం అయ్యాయి.

క్లుప్తంగా

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి


సాయిరెడ్డి (ఫైల్)

పరిగి: ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన పట్టణ కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మోహనకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ఎర్రవాపుల సాయిరెడ్డి(76) పని నిమిత్తం పరిగికి వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్లేందుకు ఆటో స్టాండ్‌కు బయలు దేరాడు. పరిగి నుంచి షాద్‌నగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు బహార్‌పేట చౌరస్తాలో ఆయన్ని ఢీకొంది. తలకు బలమైన గాయం కావడంతో వెంటనే పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం నగరానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి భార్య సుశీలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సబితారెడ్డిని అవమానించడం తగదు


మట్లాడుతున్న రాజుగౌడ్

తాండూరు: మాజీ మంత్రి సబితారెడ్డిని అధికారిక కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు అవమానించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని వికారాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సందల్ రాజుగౌడ్ పేర్కొన్నారు. బుధవారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. మహేశ్వరంలో జరిగిన ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలను మంత్రి పక్కన కూర్చుబెట్టుకోవడం సరికాదన్నారు. మహిళ అని చూడకుండా మాజీ మంత్రి సబితారెడ్డిని అవమానించడం తగదన్నారు. బీఆర్ఎస్ నాయకులు తలచుకొంటే ఇన్‌చార్జ్ మంత్రిని చేవెళ్ల గడ్డపై తిరగనివ్వమన్నారు. మరోవైపు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీని వీడి బీజేపీలో చేరుతున్నారంటూ సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోందన్నారు.

చోరీ కేసులో మూడేళ్ల జైలు

పరిగి: చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్షను ఖరారు చేస్తూ పరిగి జూనియర్ సివిల్ కోర్టు జడ్జి శ్రీరామ్ తీర్పునిచ్చినట్లు స్థానిక ఎస్ఐ మోహనకృష్ణ ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన సయ్యాద్ ఫెరోజ్ ఇంట్లో 2025 మార్చి ఒకటిన బంగారు, వెండి నగలు దొంగతనం జరిగినట్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే గ్రామంలో 2024 అక్టోబర్ 14న భారతమ్మ ఇంట్లో బంగారు, వెండి నగలు చోరీ జరిగినట్టు పోలీసులను ఆశ్రయించారు. ఈ రెండు కేసులను దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా వడ్డెర పాలెంకు చెందిన తన్నీరు శ్రీనును అదుపులోకి తీసుకుని విచారించారు. అతని వద్ద నుంచి బంగారు, వెండి నగలు రికవరీ చేసి కోర్టులో డిపాజిట్ చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో భాగంగా బుధవారం కోర్టులో వాదోపవాదనలు విన్న తరువాత దొంగతనం చేసినట్టు రుజువు కావడంతో జడ్జి నేరస్తుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.100 జరిమాన విధించినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ డ్రైవర్ మృతి

పూడూరు: చికిత్స పొందుతూ ఓ డ్రైవర్ మృతి చెందిన సంఘటన చన్గోముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ భరత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ ఆలంపల్లికి చెందిన హాజీపాషా(24) డీసీఎం వాహనంతో నగరంలోని మార్కెట్‌కు మంగళవారం రాత్రి 2 గంటలకు బయలుదేరాడు. మార్గమధ్యలో ఎన్కేపల్లి గేటు సమీపంలో డీసీఎం అదుపుతప్పి మర్రి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హాజీపాషా తల, కాళ్లకు బలమైన రక్త గాయాలయ్యాయి. వెంటనే అతడిని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు రెఫర్ చేశారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తల్లి షాహిన్‌బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విధుల్లో ఉన్న కండక్టర్.. గుండెపోటుతో మృతి

అబ్దుల్లాపూర్‌మెట్: విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ కండక్టర్‌కు గుండెపోటు రావడంతో మృతి చెందిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారం గ్రామానికి చెందిన నిమ్మల బాలరాజ్‌గౌడ్(54) హయత్‌నగర్– 2 డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం విధుల్లో చేరిన బాల్‌రాజ్ రాత్రి 8.45గంటలకు అబ్దుల్లాపూర్‌మెట్‌లోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీకి బస్‌లో వచ్చాడు. రాత్రి బస్సును కాలనీలో పార్క్ చేసి(నైట్ హాల్ట్), బ్లాక్ నం.62/1లో విశ్రాంతి తీసుకుంటుండగా రాత్రి 11.20 గంటలకు ఛాతిలో నొప్పి వస్తోందని డ్రైవర్ ఉపేందర్‌కు చెప్పాడు. దీంతో ఆయన 108కు సమాచారం ఇవ్వగా అతన్ని పరీక్షించిన సిబ్బంది అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆహ్లాదం.. విజ్ఞానం

- ఆట పాటలతో పూర్వ ప్రాథమిక విద్య
- విద్యార్థులతో కలిసిపోయి చదువు నేర్పుతున్న ఉపాధ్యాయులు
- ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి
- జిల్లాలో 36 పాఠశాలలు ఎంపిక


నాజుఖాన్‌పల్లిలో చిన్నారులకు ఆట పాటలతో విద్యా బోధన

దుద్యాల్: సర్కారు బడులను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక కార్యక్రమాలతో ముందుకు వెళుతోంది. అందులో భాగంగానే ఏకరూప దుస్తులు(యూనిఫాం) అందించడం, పాఠ్య, రాత పుస్తకాలతో సాంకేతికతను అందించేలా డిజిటల్ విద్యను ప్రవేశ పెట్టింది. మూడేళ్లు నిండిన చిన్నారులను ప్రైవేట్ పాఠశాలలో చేర్పిస్తుండడంతో మెజార్టీ తల్లిదండ్రులు అక్కడే తమ పిల్లలను కొనసాగిస్తున్నారు. సర్కారు బడుల్లో పూర్వ ప్రాథమిక విద్య లేకపోవడంతో ఇటువైపు అనాసక్తి చూపుతున్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కొనసాగుతున్న అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అంగన్‌వాడీ కేంద్రాలతో పాటు కొన్ని ప్రభుత్వ పాఠశాలలో కూడా కొంత మంది ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి చిన్నారులకు ప్రత్యేకంగా ఆటపాటలతో బోధనను అందిస్తున్నారు.

పేద విద్యార్థులకు మేలు

ప్రభుత్వ పాఠశాలలో సైతం పూర్వ ప్రాథమిక విద్యను అమలులోకి తీసుకువస్తే ప్రైవేట్ బడులకు వెళ్లే విద్యార్థుల సంఖ్య తగ్గించవచ్చని నిపుణులు చెబుతున్నారు. పిల్లలకు మూడేళ్లు నిండగానే అంగన్‌వాడీ కేంద్రాలకు పంపిస్తున్నా అక్కడ ఆ మేరకు విద్యను అందిపుచ్చుకోలేకపోతున్నారనే వాదన తల్లిదండ్రుల్లో బలంగా నాటుకుంది. దీంతో మూడేళ్ల వయసు వచ్చే వరకు ఇంటిలో ఉంచుకుని ఆ తర్వాత ప్రైవేట్ పాఠశాలలకు సాగనంపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశ పెడితే పేద విద్యార్థుల భవిష్యత్తుకు దిక్సూచిగా మారే అవకాశం లేకపోలేదు.

మూడేళ్లకు ప్రైవేట్.. ఐదేళ్లకు సర్కార్

ప్రస్తుతం పిల్లలకు మూడేళ్లు నిండగానే నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీల పేరుతో ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. అదే సర్కారు పాఠశాలకు అయితే ఐదేళ్లు నిండిన వారికి ఒకటో తరగతిలో ప్రవేశాలు కల్పిస్తున్నారు. తల్లిదండ్రులకు అసలు సమస్య ఇక్కడే మొదలవుతుంది. ఐదేళ్ల వరకు పిల్లవాడిని పాఠశాలకు పంపించకుండా ఇంట్లో ఉంచుకోవడంతో వయసు పెరిగి విద్య బుద్ధులు నేర్చుకోవడానికి ఇబ్బంది అవుతుందని భావించి, మూడేళ్లకే ప్రైవేట్ బడికి పంపుతున్నారు. ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించి సర్కారు పాఠశాలల్లో కూడా 3–4 ఏళ్ల వయసు పిల్లలను చేర్చుకొని పూర్వ ప్రాథమిక విద్యను అందించడం మొదలు పెడుతుంది. మండల పరిధిలోని నాజుఖాన్‌పల్లి, ఆలేడ్, హకీంపేట్, చిలుముల మైల్వార్, పోలేపల్లి తదితర ప్రాథమిక పాఠశాలల్లో కొంత మంది ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక బోధన అందిస్తున్నారు.

సన్నాహాలు చేస్తున్నాం



పూర్వ ప్రాథమిక విద్యను ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఈ విద్యను అమలు చేయడానికి జిల్లాలో 36 పాఠశాలలను ఎంపిక చేశాం. ప్రస్తుతం ఐదు బడుల్లో బోధన కొనసాగుతుంది. త్వరలో మిగతా పాఠశాలలో కూడా అమలు చేస్తాం. మునుముందు మరింతగా విస్తరిస్తాం.

– రేణుకాదేవి, జిల్లా విద్యాధికారి

పన్ను చెల్లింపుతోనే అభివృద్ధి


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సుధీర్

అదనపు కలెక్టర్ సుధీర్

అనంతగిరి: గ్రంథాలయాలను అభివృద్ధి పరిచేందుకు గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు లైబ్రరీ పన్నులను తప్పనిసరిగా వసూలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అధికారులను ఆదేశించారు. బుధవారం గ్రంథాలయ పన్ను వసూలు కమిటీతో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) తన ఛాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రంథాలయ సంస్థలకు ప్రధాన ఆదాయ వనరు పన్ను మాత్రమేనని, వసూలును బట్టి జిల్లాలో అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు చెల్లించాల్సిన గ్రంథాలయ పన్నులను సకాలంలో చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత ఐదేళ్లుగా చెల్లించాల్సిన గ్రంథాలయ బకాయి పన్నును చెల్లించే దిశగా అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. గ్రంథాలయాలను జ్ఞానాన్ని పెంపొందించే దిశగా తీర్చి దిద్దాలని, భవిష్యత్ తరాలకు కూడా ఎంతగానో ఉపయోగపడే విధంగా చేయాలన్నారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, జిల్లా ఆడిట్ అధికారి శ్రీనివాస్‌బాబు, గ్రంథాలయ కార్యదర్శి సురేష్, మున్సిపల్ కమిషనర్లు బలరాంనాయక్, విక్రమ్ సింహారెడ్డి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడపొద్దు


వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

మోమిన్‌పేట: మద్యం తాగి వాహనం నడిపితే కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. బుధవారం మండల పరిధిలోని మొరంగపల్లి చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నడుపుతున్న సమయంలో మద్యం తాగరాదన్నారు. ద్విచక్ర వాహనం నడిపే వ్యక్తులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. వాహనానికి సంబంధించి అన్ని పత్రాలు ఉండాలన్నారు. నంబరు లేని వాహనం రోడ్డు ఎక్కకూడదని హెచ్చరించారు. నిషేధిత వస్తువులను రవాణా చేయ్యొద్దన్నారు. ఎట్టి పరిస్థితుల్లో చట్టాన్ని ఉల్లంఘించే వారిని ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ బలరాం, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ


పోలీస్‌స్టేషన్ ఆవరణలో మధ్యాహ్న భోజన కార్మికులు

పరిగి: కార్మికుల సమస్యలను పరిష్కరించడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులను విడుదల చేయాలని బుధవారం నగరంలోని విద్యా కమిషన్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాను పోలీసులు అడ్డుకున్నారు. భోజన కార్మికులు, సీఐటీయూ నేతలను పోలీసులు ముందస్తుగా అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యబద్ధంగా నిరసనలు చేసుకుంటే ప్రభుత్వం అడ్డుకోవడం ఏంటని ప్రశ్నించారు. సర్కారు కార్మికులకు ధర్నా చేసే హక్కులను కాలరాస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు కార్మికులకు రూ.పది వేలు ఇస్తామని చెప్పి ప్రస్తుతం ఇవ్వడం లేదన్నారు. భోజన కార్మికులకు బిల్లులు, గౌరవ వేతనాలు సక్రమంగా రాక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవికుమార్, శ్రీశైలం, సువర్ణ, రాములమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

తాండూరు: ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం తెచ్చి విక్రయిస్తున్నారంటూ తాండూరు పట్టణానికి చెందిన ఇద్దరిని హైదరాబాద్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు అరెస్టు చేశారు. రెండు రోజుల క్రితం నగరంలో మద్యం తరలించి విక్రయిస్తున్న ఓ ముఠాను ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. విచారణలో తాండూరు పట్టణానికి చెందిన కల్వ సాయి, పోల వంశీలు ఉన్నట్టు తేలింది. దీంతో మంగళవారం సాయంత్రం టాస్క్‌ఫోర్స్ అధికారులు ఇద్దరిని అరెస్టు చేసి హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయమై తాండూరు ఎక్సైజ్ సీఐ ఆదిశేషును వివరణ కోరగా.. టాస్క్‌ఫోర్స్ అధికారులు నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్ విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసిన విషయం వాస్తవమేనని స్పష్టం చేశారు. టాస్క్‌ఫోర్స్ అధికారుల విచారణ అనంతరం పూర్తి వివరాలు తెలుస్తాయని చెప్పారు.

టిఫిన్ సెంటర్‌లో చోరీ.. వాహన తనిఖీలో పట్టుబడి

పరిగి: మండల పరిధిలోని రాఘవాపూర్‌లో మంగళవారం రాత్రి దొంగతనం జరిగింది. గ్రామ చౌరస్తాలో శ్రీరాం టిఫిన్ సెంటర్ రోజు మాదిరిగానే రాత్రి వరకు నిర్వహించి గిరాకీ డబ్బులను అందులోనే ఉంచి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం వచ్చి చూడగా దుకాణం ఒక వైపు తెరిచి ఉండటంతో గల్లాపెట్టెను పరిశీలించగా రూ.11 వేలను ఎత్తుకెళ్లారు. వెంటనే యజమాని రాములు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై మోహన్ క్రిష్ణ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. పట్టణ కేంద్రంలోని కొడంగల్ చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఓ వ్యక్తి కనిపించడంతో అతనిని విచారించగా దొంగతనం చేసినట్టు అంగీకరించాడు. దోమ మండలం బొంపల్లి పెద్దతండాకు చెందిన నేనావత్ గణేష్‌గా గుర్తించారు. సొత్తును రికవరీ చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి

కేశంపేట: విద్యుదాఘాతంతో కాడెద్దు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని బొదునంపల్లి గ్రామ శివారులో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి ఎదిరె ఆంజనేయులు తన వ్యవసాయ పొలంలోని పశువుల పాకలో రోజు మాదిరిగా తన పశువులను కట్టేశాడు. కాడెద్దు తాడును తెంపుకొని విద్యుదాఘాతంతో మృతి చెందింది.

నిరుపయోగం.. కూలేందుకు సిద్ధం


హస్నాబాద్ పాఠశాలలో శిథిలావస్థకు చేరిన వాటర్ ట్యాంక్


నాజుఖాన్‌పల్లిలో నిరుపయోగంగా ట్యాంక్

వాటర్ ట్యాంక్‌లతో పొంచి ఉన్న ప్రమాదం

దుద్యాల్: మండలంలోని గౌరారం, నాజుఖాన్‌పల్లి, హస్నాబాద్ గ్రామాల్లో నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకులు పూర్తిగా శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారాయి. అవి ఎప్పుడు కూలుతాయోననే భయంతో ఆయా గ్రామాల్లో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గౌరారంలో ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఉన్న వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా ఉంచారు. హస్నాబాద్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంకు తీవ్ర ప్రమాదకరంగా మారింది. వినియోగించక చాలా ఏళ్లు అవ్వడంతో ఎప్పుడు కూలుతుందోనని విద్యార్థులు వాపోతున్నారు. నాజుఖాన్‌పల్లిలో ఓ వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. ప్రమాదాలు సంభవించకముందే అధికారులు స్పందించి ఆయా గ్రామాల్లో వాటర్ ట్యాంక్‌లను తొలగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు


జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులతో వ్యాయామ ఉపాధ్యాయులు

తాండూరు రూరల్: పెద్దేముల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో రెండు రోజులుగా జోనల్ స్థాయి క్రికెట్ పోటీలు నిర్వహిహించారు. జోనల్ పరిధిలోని పెద్దేముల్, కోట్‌పల్లి, , ధారూర్‌లోని అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అండర్–17, అండర్–14 జట్టుగా ఏర్పాటు చేశారు. బుధవారం ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను గుర్తించి వికారాబాద్ జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు జోనల్ కార్యదర్శి శివప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు పాల్గొన్నారు.

భార్యాభర్తలపై కత్తితో దాడి

- పశువుల మేత విషయంలో గొడవ
- పోలీసుల అదుపులో తండ్రీకొడుకులు
- ఇద్దరిపైనా హత్యాయత్నం కేసు నమోదు


దాడిలో గాయపడిన రఫియా



కత్తితో దాడి చేస్తున్న హఫీజ్

మొయినాబాద్: పశువుల మేత విషయంలో చోటుచేసుకున్న దాడిలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మొయినాబాద్‌కు చెందిన మహ్మద్ హఫీజ్, మహ్మద్ వాజిద్ ఖురేషీ ముర్తూజగూడ రెవెన్యూలోని షమ్స్ కాలనీలో ఇళ్లు కట్టుకుని, కుటుంబాలతో కలిసి నివాసం ఉంటున్నారు. ఇరువురి వద్దా మేకలు, గేదెలు, ఆవులు ఉన్నాయి. కాలనీలోని ఖాళీ ప్లాట్లలో వీటిని మేపుతుంటారు. బుధవారం ఉదయం వాజిద్ తన మేకలు, గేదెలను ఓ ప్రాంతంలోని ఖాళీ ప్లాట్లలో కట్టేశాడు. ఇది గమనించిన హఫీజ్, అతని కొడుకు అఫ్రోజ్ ముందు నుంచీ తమ పశువులను ఇక్కడే మేపుతున్నామని, నీవెందుకు కట్టేశావని వాజిద్‌తో గొడవ పడ్డారు. మాటామాటా పెరగడంతో అఫ్రోజ్ తమ ఇంట్లో నుంచి కొమ్మలు కొట్టే కత్తి తీసుకొచ్చి తండ్రికి ఇచ్చాడు. ఇద్దరూ కలిసి పక్కింట్లో ఉండే వాజిద్‌పై దాడి చేశారు. అడ్డుకోబోయిన అతని భార్య రఫియాను సైతం కత్తితో గాయపర్చారు. దీంతో వాజిద్ తల, మెడ, ఛాతితో పాటు శరీరంపై గాట్లు పడ్డాయి. రఫియా తలకు తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను ఆస్పత్రికి తరలించారు. దాడికి పాల్పడిన తండ్రీకొడుకులను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఇరువురిపైనా హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కాపుకాచి కత్తులతో యువకుడిపై దాడి

పాతకక్షలే కారణమని ఫిర్యాదు

బషీరాబాద్: పాతకక్షల నేపథ్యంలో ఓ యువకుడిని మార్గమధ్యలో కాపుకాచి కొంతమంది మారణాయుధాలతో దాడి చేశారు. ఈ ఘటనలో బాధితుడికి తీవ్ర రక్తగాయాలయ్యాయి. ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ నుమాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరు పట్టణం సాయిపూర్‌కు చెందిన సయ్యద్ ఫజల్(25) మంగళవారం బషీరాబాద్‌లోని తన సోదరుడైనా సయ్యద్ అంజాద్ ఇంటికి వెళ్లాడు. అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో బైక్‌పై తాండూరు వెళుతుండగా బషీరాబాద్ శివారులోని హెచ్‌పీ గ్యాస్ గోదాం దగ్గర రోడ్డుపై మాటువేసిన తాండూరుకు చెందిన వినోద్, మురళి, చిన్న మురళి, ఇర్ఫాన్ అనే యువకులు కత్తులు, ఇనుప రాడ్లతో ఫజల్‌పై మూకుమ్మడిగా దాడి చేశారు. వారి నుంచి తప్పించుకుని బషీరాబాద్‌లోని అన్న ఇంటికి రక్తగాయాలతో అతడు చేరుకున్నాడు. వెంటనే 108 అంబులెన్స్ ద్వారా తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ దాడిలో ఫజల్ మొహం, నుదుటిపైన తీవ్ర రక్త గాయాలయ్యాయి. పాతకక్షలే దాడికి కారణంగా బాధితుడి కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. దాడిలో 8 మంది వరకు పాల్గొని ఉంటారని చెబుతున్నారు. బాధితుడి సోదరుడు అంజద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భారీ మెజార్టీతో గెలిపించండి

అనంతగిరి: హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ(మణికొండ జాగీరు) ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ ప్యానల్ ప్రతినిధి రిటైర్డు జాయింట్ కలెక్టర్ సురేష్ పొద్దార్ కోరారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్‌లో సొసైటీ మెంబర్లు, ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొసైటీలో ధర్మారెడ్డి రిటైర్డు కలెక్టర్ ప్యానల్‌లో ఉన్న తమను తప్పకుండా ఆదరించి గెలిపించాలని కోరారు. అభ్యర్థుల గెలుపు ఆవశ్యకతను, తదితర విషయాలను వివరించారు. ఈనెల 10న జరిగే ఎన్నికల్లో పాల్గొని గెలిపించాలని కోరారు. సమావేశంలో ప్యానెల్ ప్రతినిధులు సత్యనారాయణరెడ్డి, విశ్వనాథం, వేమారెడ్డి, వికారాబాద్ ప్రాంతానికి చెందిన సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కరపత్రం ఆవిష్కరిస్తున్న ప్యానెల్ ప్రతినిధులు

వసతి.. అధోగతి..!


నిరుపయోగంగా ఉన్న మోడల్ స్కూల్ హాస్టల్ భవనం

- మూడేళ్లుగా నిరుపయోగంగా మోడల్ స్కూల్ హాస్టల్
- విద్యుత్, నీటి సదుపాయం లేకపోవడంతో వృథాగా..
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు


ఏపుగా పెరిగిన ముళ్లపొదలు

బషీరాబాద్: ప్రభుత్వ ఆదర్శ పాఠశాలల్లో హాస్టల్ వసతి లేక విద్యార్థినులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. 2016లో అప్పటి సర్కారు వెనుకబడిన మండలాలకు మోడల్ స్కూల్స్ మంజూరు చేసింది. 2019లో బషీరాబాద్ మండలంలో రూ.1.28 కోట్లతో హాస్టల్ భవన నిర్మాణ పనులు చేపట్టారు. అన్ని సౌకర్యాలతో భవనాన్ని పూర్తి చేసి 2022లో టీఎస్ఈడబ్ల్యూడీసీ అధికారులు జిల్లా విద్యాశాఖకు అప్పగించారు. భవనం అందుబాటులోకి వచ్చి మూడేళ్లు గడిచిన హాస్టల్ ప్రారంభించలేదు. ప్రస్తుతం 120 మంది విద్యార్థినులు వసతి సౌకర్యం లేక రోజూ పాఠశాలకు 3 కి.మీ. కాలినడకన వచ్చి వెళ్తున్నారు.

భవనం అప్పగించాలి

మండలంలోని ఆయా గ్రామాల నుంచి రోజూ విద్యార్థినులు 3 కి.మీ. నడుచుకుంటూ పాఠశాలకు వస్తున్నారు. వంద మంది ఉండేలా హాస్టల్ నిర్మించారు. భవనానికి కరెంట్, తాగునీటి కనెక్షన్ ఇవ్వలేదు. చిన్ని చిన్న మరమ్మతులు చేయాల్సి ఉంది. వాటిని పూర్తి చేసి తమకు అప్పగిస్తే హాస్టల్‌ను ప్రారంభిస్తాం.

– అనీల, ప్రిన్సిపాల్, బషీరాబాద్ ఆదర్శ పాఠశాల

ప్రతిపాదనలు పంపాం

మోడల్ స్కూల్ హాస్టల్ భవనంలో చిన్నచిన్న మరమ్మతులు చేయాల్సి ఉంది. ఇందుకు రూ.6.50 లక్షలు అవసరం. వారం రోజుల క్రితం ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం. హాస్టల్ బిల్డింగ్‌పై మరో ఫ్లోర్ వేయడానికి రూ.60 లక్షలతో ప్రతిపాదనలు పంపాం.

– శ్రీనివాసులు, డీఈ, టీఎస్ఈడబ్ల్యూఎస్

దెబ్బతిన్న తలుపులు, కిటికీలు

మూడేళ్ల క్రితం పూర్తయిన హాస్టల్ భవనానికి తాగునీటి వసతి లేదు. కరెంట్ కనెక్షన్ ఇవ్వలేదు. భవనం గురించి పట్టించుకునే వారు లేకపోవడంతో తలుపులు దెబ్బతిన్నాయి. కిటికీలు, అద్దాలు, పాడయ్యాయి. బాత్‌రూమ్‌లు, ఫ్యాన్లు పాడైపోయాయి. భవనం చుట్టూ, లోపల ముళ్ల చెట్లు ఏపుగా పెరిగాయి.